

# సింహాసనం

శ్రీరాజ్

తెల్లవారిందికదండీ?

'అవును. తెల్లవారకపోతే— ఆ చెట్టు మీద పిట్టలు అంత సందడిగా ఎందుకుంటాయి? పెరట్లో చల్లగాలి నన్ను పలకరించదే? పాలవాడు వాకిట్లో తలుపులు దబదబా కొట్టడు కదా? మరి కాసేపట్లో తూర్పున సిందూరం చూసి. ప్రతి ఒక్కరూ జీవనపోరాటానికి సిద్ధం కావలసిందే।

అబ్బా! ఆకాశాన్ని పులుముకొని, అలముకొనే ఆ ఎరుపును ఎన్నిసార్లు చూశాను. నా జీవితంలో ఎన్ని పోరాటాలు సాగించాను. ఎన్ని సాహసాలు చేశాను. ఎన్ని విప్లవాల గొంతులు విన్నాను. ఆ జీవితం, ఆ దృశ్యాలు చెరిగి కరిగిపోయే కలలు కావండీ. ఎవర్ లాస్టింగెమోషనల్ త్రిల్లింగ్స్.

ఇప్పుడు నా వయస్సెంతనుకుంటున్నారు? ఒన్లీ సిక్స్టీ ఇయర్స్ అరవయేళ్ళనేసరికి పళ్ళు ఊడిపోయాయని, జుత్తు నెరిసిపోయిందని, జవసత్వాలుడిగిపోయాయని, ఓ ముసలి గుంటనక్కనని అనుకుంటున్నారా? నో....నో. నేనెంత దృఢంగా ఉన్నానో మా ఆవిడ సుందరాన్ని అడగండి. నా తల యింకా నల్లగా నిగనిగలాడుతుందని కూడా చెప్తుంది.

నా పరిస్థితి మరోలా ఉంటే— ఈ ఇంట్లో మా అబ్బాయిలూ, అమ్మాయిలూ, కోడళ్ళు, అల్లుళ్ళు, వాళ్ళపిల్లలు, బంధువులు స్నేహితుల సమక్షంలో బ్రహ్మాండంగా షష్టిపూర్తి జరిపించుకొనేవాణ్ణి. పని కొచ్చేవాటికి ఆయుధపూజ, సిందూరం బొట్లుగాని పనికిరాని తుప్పుపట్టిన యంత్రానికి ఎందుకు? అయినా— మా ఇంటి ఆర్థిక పరిస్థితి బావులేదని పెద్దకోడలు పదేపదే గుర్తుచేస్తుంటుంది. అవును, విలాసాలకి, విందులకు డబ్బు వృథాచేయడం న్యాయంకాదు సుమండీ।

ఒకప్పుడు నాది చాలా పెద్ద ప్రపంచం. ఒక సామ్రాజ్యం, అందులో ఒక సింహాసనం, ఆ సింహాసనాన్ని అధిష్ఠించిన సమ్రాట్టును నేను. ఆ తేజస్సు ఎంతో గొప్పగా ఉండేది। ఇప్పుడు నాది చాలా చిన్నలోకం. పదడుగులు కూడా లేని ఇరుకు గది. అందులో విరిగిన ఒక పాత వాలుకుర్చీ, దాంట్లో యిరవై నాలుగు గంటలూ కూలబడే నిస్సహాయుణ్ణి నేను. ఈ చీకటి ఎంత బాధగా ఉంటుంది।

మనిషిచేసే పాపపుణ్యాలకి ప్రతిఫలం ఎక్కడో పైలోకాల్లో ఉంటుందంటారు. అది వట్టి అబద్ధం. అయ్ డోంట్ బిలీవిట్. ఇట్స్ ట్రాష్. మనిషి చచ్చేముందు— తను చేసిన తప్పుకి గాని ఒప్పుకిగాని చెడైనా మంచైనా యిక్కడే అనుభవించక తప్పదు. అందుకు నా జీవితమే పెద్ద ఉదాహరణ.

నేను చెడ్డవాణ్నని మీరూహించుకొని, భయపడుతున్నారా? ఒక చెడ్డవాడు కథ వినిపిస్తున్నాడని, అందులో అబద్ధం మాత్రమే ఉంటుందని అనుకుంటున్నారా? ఒకప్పుడు నేను చెడ్డవాణ్నే. కాదనను. కానీ, చెడ్డవాడు కూడా అంతరాత్మ ముందు మంచివాడేనండీ. అప్పుడు నేను చేసే ప్రతిచర్య నాకు మంచిగా తోచేది. నాలో స్వార్థం ఉన్నప్పటికీ నేను చాలా మంచి అధికారినని అనుకొనేవాడ్ని. నీతి నిజాయితీలతో బుజా

మార్గాన నడుస్తున్న ఉత్తమోత్తముణ్నని భ్రమపడేవాణ్ణి. కానీ, యిప్పుడు నాలో ఆ పెద్దతనం లేదు. నేను అబద్ధం చెప్పను. ఉన్న నిజాన్ని, జరిగిన వాస్తవాన్ని మీకు చెప్తాను. ఇప్పుడు నేను అంతరాత్మముందు చేతులు కట్టుకొని, తలవంచుకొని నిలబడిన మంచివాణ్ణి.

సారీ, మాస్టారూ! మీ అనుమతి లేకుండా, పూర్తిగా తెల్లవారకుండా, మిమ్మల్ని ఏ పనీపాటా చేసుకోనివ్వకుండా నా కథ వినిపిస్తున్నానని చిరాకు పడకండి. ఏఁవిటో- ఈ రోజు మీతో కాసేపు మాట్లాడాలనిపించింది.

పదేళ్ల క్రిందట—

ఓహ్! ఆ పాలవాడు చూడండీ, పాపం చేతులు నొప్పెట్టుంటాయి ఎంత సేపట్నుంచో మా తలుపులు బాదుతున్నా ఒక్కరూ లేచి రావడంలేదు. ఒన్ మినిట్. వాణ్ని పంపించాక, కథ ప్రారంభిస్తాను.

"సుందరం.... సుందరం!.... పాలవాడు పిలుస్తున్నాడు."

పాపం! సుందరం రాత్రి ఏ పన్నెండుకి నడుంవాల్చిందో?

సుందరం లేచివచ్చి, పాలు తీసుకుందనుకుంటా. చూశారా? వాడు వెళ్లిన తర్వాత వానవెలిసినట్లుంది. ఆఁ....

పదేళ్ల క్రిందట—

నేను ఎక్కడ గుమస్తాగా పని చేశానో, అదే ఆఫీసుకి మేనేజరుగా వచ్చాను. మాది చాలా పెద్ద ఆర్గనైజేషన్. ప్రజాసేవకి అంకితమైన సంస్థ. అందులో ఒక విభాగానికి చెందిన ఆఫీసర్ని.

మా ఆఫీసులో వాతావరణం చాలా చిత్రంగా ఉంటుంది. క్రమశిక్షణ కనిపించదు. అంతా కంపార్ట్‌మెంటలైజేషన్. చాలా చాలా కేడర్లున్నాయి. ఒక్కో కేడరుకి ఒక్కో లీడరు. ఎన్నో యూనియన్లు. మరెన్నో పాలిటిక్స్. బంట్రోతు మొదలుకొని ఆఫీసరువరకు ఎవరికి వాళ్లు ఓ గిరిగీసుకొని, అందులో వాళ్ల ఆధిక్యతను చూపించుకోవటానికి తాపత్రయపడతారు. ప్రతివిషయంలో వాదనలు, ప్రతివాదనలు చెలరేగుతాయి. వాళ్లందరికీ మేనేజరు కాస్త మెతగ్గా కనిపిస్తే లోకువైపోతారు.

అలాంటి వాతావరణం నేను భరించలేకపోయాను. ఆఫీసులో అందరూ తెలియడంవలన నా దగ్గర అతి చనువు తీసుకోవడం మొదలుపెట్టారు. బట్ అయ్ కాంట్ యాక్సెప్టిట్. అధికారిగా నాకొక ప్రత్యేకత కావాలి. అందుకు, ఆఫీసు సిబ్బందితో కఠినంగా ఉండాలి. పెద్దవాణ్ని తిట్టడం తెలిసిన మనిషికి- కొట్టే వాణ్ని- 'ఎందుకు' అని నిలదీసే ధైర్యంలేదు.

ఛార్జితీసుకున్న నెలరోజుల్లో అందరికీ నాగురించి తెలిసిపోయింది. నేను ప్రతి విషయానికి పొసగనని, నాలో ఎలాంటి దయాదాక్షిణ్యాల్లేవని, అవసరమైతే అడ్మినిస్ట్రేషన్ని ఎదిరించిన వ్యక్తిని ఎంత కఠినంగానైనా శిక్షించగలనని, యూనియను లీడర్లుతో చీటికీమాటికి సంప్రదింపులు చేయనని, యింకా చాలా చాలా తెల్సుకున్నారు.

మొదట అందరి కాన్ఫిడెన్షిల్ రికార్డ్సు తిరగేశాను. రౌడీ జట్టులాంటి ఓ పది మందికి సర్క్యులాఫీసుకి రాసి, వేరు వేరు ప్రాంతాలకి బదిలీలు చేయించాను. పని దొంగలు కొందర్ని పనిఒత్తిడిఉన్న సీట్లకి మార్చాను. సెలవులు ఎక్కువగా తీసుకొనేవాళ్లకి యింక్రిమెంట్లు కోత పెట్టాను. అప్పగించిన పని సవ్యంగా సకాలంలో అందివ్వని అసమర్థుల 'సీయార్సు' పాడుచేశాను. కొన్ని కొన్ని కారణాలకి కొందర్ని డిప్రమోట్ చేశాను. యూనిఫారం వేసుకోని బంట్రోతులకు మెమోలతో బుద్ధిచెప్పాను. ఎవరిలో ఎలాంటి అవకతవకలు కనిపించినా నేను సహించలేదు.

నిజానికి, ఆఫీసరు నెత్తిమీద ఎంతో బాధ్యత పెట్టి, చాలా తక్కువ పవర్సు యిచ్చారు. అయితే, ఆ తక్కువ అధికారంతో నేను ఏమీ సాధించలేను. ఎవర్నీ అదుపులో ఉంచలేను. నేనూ అందరిలో కలిసిపోయి, కొట్టుకుపోవాలి. అది నాకు యిష్టంలేదు. అందుకే, కొన్ని విషయాల్లో అతిక్రమించి చర్యతీసుకోవడం, అవసరం అయితే ఫాల్స్‌ఛార్జెస్ బనాయించి స్టాఫును గుప్పెట్లోపెట్టుకోవడం నేను చేశాను. మీరు అడగవచ్చు నన్ను— 'అన్ని యూనియన్లు ఉండి మీ ఆటను కట్టించలేదా? అని' చూశారా! అన్ని రిపీట్ అన్ని యూనియన్లు ఉన్నాయి గనుకే నన్నెవరూ ఏమీ చేయలేకపోయారు. పేలికలై చీలికలై ఒక్కొక్కటిగా విడిపోయిన దారప్పోగులు దేన్ని బంధించగలవు?


నెలరోజుల్లో మా ఆఫీసు వాతావరణం మారిపోయింది. ఆఫీసులో గొడవా గోలా వినిపించడంలేదు. ఆరోగ్యకరమైన నిశ్శబ్దం. పని చకచకా సాగిపోతుంది. ఆఫీసు కవతల ఎవరైనా నన్ను తిట్టవచ్చును గాని నా ఎదుట అంతా పిరికివాళ్లు. ఎప్పుడైనా ఏ అమాయకుడో నన్నుగాని, నా చర్యల్ని గాని విమర్శిస్తున్నట్లు కనబడితే— పాపం! అతడి చరిత్ర మారిపోతుంది.

అందుకే, నాకు ఓ చక్కని బిరుదిచ్చారు. ఇచ్చినవాడెవడో యిప్పటికీ నాకు తెలీదు. బహుశా, అందరూ ఈ చిన్న విషయంలోనే ఒక్కమాటగా నిలబడి ఉండొచ్చును.


కాసేపు కథ ఆపుదాం. బయట వాకిట్లో బిచ్చగాడు చాలాసేపట్నుంచి అరుస్తున్నాడు.

"రెండు కళ్లులేని అనాదజల్మ తల్లీ... బిచ్చం ఎయ్యండమ్మా.... దరమ తల్లులు.... కబోదిని. కనికరించండి"

మామూలు సంఘటన :




సినిమాలో యిలా చూస్తాం : :




గుడ్డివాడికి లోకం కనిపించకపోవచ్చును. ఏది ఎలా ఉంటుందో తెలీకపోవచ్చును. కానీ, ఆకలి బాధా ఏడుపు లాంటివి ఎందుకు తెలియవు.

వాడు గొంతుపోయినట్లు ఎంతగా అరుస్తున్నప్పటికీ మా యింట్లో ఎవరూ వినిపించుకోవడం లేదు. ఈ సమయంలో కాన్వెంటుకి టైమవుతుందని పిల్లలిద్దర్నీ పెద్దకోడలు ముస్తాబు చేస్తుంటుంది. సుందరం పెరట్లో పంచపాత్ర తోవుతూ ఉండాలి. పెద్దబ్బాయి విష్ణు తన గదిలో టేబిలుముందు కూర్చొని ఆఫీసు వాల్యూం పేజీలు తిరగేస్తూ ఉంటాడు. చిన్నవాడు క్రిష్ణ సబ్బు నురు గెక్కించి, గడ్డంచేసుకుంటూ ఉంటాడు. చిన్నకోడలు పురుడుకోసం వాళ్ల పుట్టింటికి వెళ్లిందిలెండి. ఎవరి పనుల్లో వాళ్లుంటారు. ఎదుట మనిషి ఉన్నది లేనిది కళ్ళులేనివాడు గుర్తించలేడని కాబోలు— ఎవరూ వాడి కేకల్ని పట్టించుకోవడం లేదు.

ఆ బిచ్చగాడ్ని పొమ్మని నేను చెప్ప లేకపోతున్నాను.

పిలిచిన కాసేపటికి సుందరం రుస రుసలాడుతూ లోపల్నుంచి వచ్చి, ముష్టివాడికి పిడికెడు బియ్యంతోబాటు పుట్టెడు చీవాట్లు కూడా వేసింది. బిచ్చగాడు వెళ్లిపోయాడు. ఇప్పుడు అరుపులు లేవు.

మనం మళ్లీ కథలోకి వద్దాం.

ఆ రోజు మా ఆఫీసులో ఆగష్టు పదిహేను వేడుకలు జరిగాయి. కార్యక్రమం చివరిలో 'మరో రాక్షసుడు' అనే నాటిక ప్రదర్శించారు. ఆ నాటికను ఆఫీసులో పనిచేస్తున్న ఓ దర్జీ రాస్కెల్ కుర్ర గుమస్తాగాడు రాశాడు. నిరంకుశత్వం సాగించే ఓ ఆఫీసరు ఉంటాడు. అతని జులుంకి సిబ్బంది ఎన్నో యిబ్బందులు ఎదురుకుంటుంటారు. వాళ్లకి స్వాతంత్రం పోయి, రిక్త హస్తాలతో జుత్తులు పీక్కుంటున్న సమయంలో— ఆ ఆఫీసులో ఒక కథానాయకుడు దుద్భవించి, మరో రాక్షసుడిగా అవతరించిన ఆఫీసరుకి బుద్ధి చెప్పడం ఆ నాటికలో ఉన్న సారాంశం. నూటికి నూరుపాళ్లు నన్ను ఎత్తిచూపించడం కోసమే ఆ నాటిక రాయబడింది. డామిట్ నన్నెంత అవమానపరిచాడు ! అందరూ చప్పట్లు కొట్టి ఆనందిస్తుంటే, నేను కుతకుతలాడి పోయాను. నా అహంకారం దెబ్బతింది.

మర్నాడు ఆ రాస్కెల్ని నా ఛాంబరులోకి పిలిచి, చెడామడా తిట్టాను. వాడి రికార్డులో ఎర్రసిరాతో కసిదీరా రాశాను.

"ఇది నిరంకుశత్వం. అన్యాయం" అని అరిచాడు.

"స్టుపిడ్. అరవకు. నేను రాక్షసత్వం చూపిస్తే నువ్వు వీధుల్లో ఉంటావు. అప్పుడు నీ కలం, గళం ఎందుకూ పనికి రావు. ఆకలితో మాడి చస్తావు."

"మీరు బెదిరిస్తున్నారా ?"

"కాదు. హెచ్చరిస్తున్నాను. పాపం ! పదిహేను సంవత్సరాలు కష్టపడి, చదివి, ఈ ఉద్యోగంలో చేరావు. నిన్ను డిస్మిస్ చేస్తే, పాసయిపోయిన నీ రికార్డు చూసి, ఎవడూ కనికరించి నీకు జీవనోపాధి కల్పించడు."

మాట్లాడకుండా అసహాయంగా వెళ్లిపోయాడు.

దేశాన్ని, దీనప్రజానీకాన్ని జాగృతం చేసి, వెలుగులోకి నడిపించగల రచయితను గడ్డిపువ్వులా అతన్నుండి పీకి, అవతలకి పారేశాను. అమ్మో ! ఈ రాస్కెల్ని విడిచిపెడితే, ఎన్ని విప్లవాలు లేవదీస్తాడో ? ఎన్ని శంఖారావాలు వినిపిస్తాడో ? ఎలాంటి చరిత్రను సృష్టిస్తాడో ?

మా విభాగంలోనే కాదు, మా సంస్థలో కూడా నాకు మంచి పేరొచ్చింది. స్టాఫును అదుపులో, ఉంచటంలో గాని, ఆదాయం పెంచటంలో గాని, ఆఫీసు ఖర్చు తగ్గించటంలో గాని, కొత్త ప్రతిపాదనల్ని అమలుపర్చటంలోగాని నాతో ఎవరూ పోటీచేయలేరన్నంత ఎత్తుకి ఎదిగిపోయాను. ఇది నిజం సుమండీ ! నా చేతికింద పనిచేసేవాళ్ల కష్టనష్టాలతో నాకేమిటి పని ?

ఒకసారి ఒకానొక దూరపు బంధువు ఉద్యోగం కావాలంటూ నా దగ్గరికి వచ్చాడు. ఈ రోజుల్లో కూడా జాతిపితను మాజాతివాడని చెప్పుకు తిరిగేవాళ్లు ఎందరో ఉన్నారు. 'కులం మతం వద్దు' అని గొంతు చించుకు మాట్లాడి మనషుల అంతరాంతరాల్లో కూడా 'కావలసినవాడు. నా కులంవాడ' నే వినాదం వినపిస్తుంది.

కావాలంటే విని చూడండి. మా వాడ్ని నా ఆఫీసులో వేసుకుంటే నా కెంతో మద్దతు దొరుకుతుంది.

వెంటనే మా వాడ్ని పిలిచి, మా ఇంట్లో పెట్టుకున్నాను. అతనికి ఉద్యోగం యివ్వాలి. ఆఫీసులో ఖాళీల్లేవు. కింకర్తవ్యం – మా ఆఫీసులో ఒక గుమస్తా ఉన్నాడు. అతను యిరవైనాలుగ్గంటలూ నిషాలో ఉంటాడు. అతని కెన్నో మెమోలు, ఛార్జిషీట్లూ యిచ్చాను. ఫలితం లేకపోయింది. ఉద్యోగం నుండి తీసెయ్యటానికి సరైన అవకాశం దొరకడం లేదు. కారణం_అతడు పనిచేసేది రెండుమూడు గంటలే అయినా రెండు రోజుల పనిని సునాయాసంగా, క్షుణ్ణంగా చేస్తాడు. కాబట్టి, ఎక్స్‌ప్లాయిటేషన్ చేయాలి.

అతన్ని పిలిచి, కాశ్మీరు వెళ్లి రమ్మని 'ఎల్టీసీ' రెండు వేలు గ్రాంటుచేశాను. ఫ్యామిలితో టూరుచేయమని పది రోజులు సెలవు కూడా యిచ్చాను. అతను సంబరపడిపోయాడు. ఎగిరి గంతేసి, నా కాళ్లు పట్టుకున్నంత పని చేశాడు. నా ఉదారత వెనుక ఎలాంటి ఉచ్చులు పన్ని ఉంచానో అతనికి తెలీదు. తాగుబోతు చేతిలో డబ్బుపడితే, ఏం జరుగుతుందో నాకు తెలుసు.

అతను టూరు వెళ్లలేదు. డబ్బంతా జల్సాగా బారులకి, రేసులకి తగలబెట్టాడు. దొంగ టిక్కెట్లతో బిల్లు పెట్టి, ఫ్రాడ్ చేసినట్లు దొరికిపోయాడు. ఉద్యోగం ఊడిపోయింది.

అతని యిల్లాలు తన ముగ్గురు పిల్లల్ని తీసుకువచ్చి, నా కాళ్లావేళ్లా పడింది. ఆ ఇంటిదీపం వెలిగించమని, వాళ్ల దరిద్రపుగొట్టు బతుకుల్ని మరీ చీకటి చెయ్యొద్దని గోలుగోలున ఏడ్చింది. నా మనసు కరిగిపోలేదు. ఎందుకు కరుగుతుంది? ముందుగా ఆలోచించి, చేసిన కుట్ర యిది. వికార్పయిన అన్యాయం జరిగిపోయింది. ఆ ఇల్లాలు కన్నీటిని తుడవటానికి కోటి చేతులు లేచి వస్తాయనుకుంటున్నారా? నో... నో... ఒక్క కన్నీటిబొట్టును తుడవటానికి ఒక్క చేయికూడా ముందుకి రాలేదు. ఎలా వస్తుంది? ఎవడి స్వార్థం వాడి చేతుల్లో పెట్టుకొని, గుండెకి గొంతుకి దగ్గరగా దాచుకుంటున్నప్పుడు కన్నీటిని తుడవటానికి చేతులకి ఖాళీ ఎక్కడుంటుంది?

అందుకే అధికార దాహం పెరిగిన నాలాంటి ఆఫీసర్లు ఏంచేసినా కిక్కురమనలేదు. నాకు అమోఘమైన తెలివి తేటలున్నాయి. వంచన చేసో, కుట్ర పన్నో ఎవరి జీవితాన్నయినా తారుమారు చేయగలను. అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు, అధికారం, సింహాసనం, స్వార్థం_ వీటిమీద ఎన్ని పుటలైన వ్రాయగలను. అయితే, అటువంటి రాతలు నిషేధింపబడ్డాయి గనుక ఆ ప్రయత్నం చేయలేదు.

మా బంధువుకి ఉద్యోగం వేయించాను.

కాసేపు ఆగండి, సార్! మా విష్ణు ఆఫీసుకి బయలుదేరినట్లుంది. అదిగో స్కూటరు స్టారుచేశాడు. పిల్లలిద్దరూ స్కూటరుమీద కూర్చొని, వాళ్లమ్మకి 'టాటా' చెప్తున్నారు. అంటే_ ఇప్పుడు తొమ్మిది దాటిందన్నమాట. కాస్త కాఫీ కడుపులో పడితేగాని లాభంలేదు.

"సుందరం.... సుందరం...."

చూస్తుండగానే ఆకాశంలో హరివిల్లు కరిగిపోయినట్లు నా పరిస్థితి మారిపోయింది. ఒకరి సాయం ఉంటేతప్ప కదల్లేను. ఇరవైనాలుగ్గంటలూ నాకు చీకటే తోడు. నన్నెవరూ పట్టించుకోరు.


సుందరం కాఫీ తీసుకొచ్చింది.

కాఫీ చల్లగా ఉంది. పంచదారకూడా లేదు. 'అదిలేదూ ఇదిలేదూ' అంటే సుందరానికి కోపం వస్తుంది. మౌనంగా కాఫీతాగి, ఖాళీకప్పు యిచ్చేశాను. సుందరం వెళ్లిపోయింది

మాష్టారూ! పంచదార ధర మహా ఘోరంగా ఉందికదూ? బ్లాక్‌లో కిలో పన్నెండు రూపాయలట. అక్రమ ఆర్జనతో తెగబలిసిపోతున్న బడాబాబుల్ని ఊరికే విడిచిపెట్టకూడదండీ. అలా విడిచిపెడితే, మీ ఊరికే ప్రమాదం. ఏం మాస్టారూ! నా మాటలకి నవ్వుతున్నారా? మీ నవ్వుకి అర్థం నాకు తెలుసులెండి. కథ పూర్తిగా చెప్పనివ్వండి.

పన్నెండేళ్ల అపజయం అంటే ఏమిటో తెలియకుండా అదే ఊళ్లో, అదే ఆఫీసులో, అదే సీట్లో పనిచేశాను.

మామూలు సంఘటన!　　　సినిమాలో యిలా చూస్తాం!!



బహుశా, ఈ దేశంలో, ఈ విషయంలో, ఇదే రికార్డేమో? నన్నెవరూ బదిలీ చేయలేకపోయారు. నా పైఅధికారుల బలహీనతలు నాకు బాగా తెలుసు. అందుకే, నా యిష్టానికి వ్యతిరేకంగా వాళ్ల అర్డర్సు జారీచేయలేదు. రాజకీయ శక్తులతో నన్ను కదిలించాలని కొందరు ప్రయత్నించారు. కానీ, ఆ రంగంలో ఉన్నవాళ్లందరూ నా వర్గం మనుషులు. నాలాంటి వాణ్ని దూరంచేసుకోవటానికి వాళ్ల యిష్టపడరు.

ఆ ఏడాది మా సంస్థలో అన్ని విభాగాల్లో ఉన్న ఆసఫీసర్లమధ్య ఆకర్షణీయమైన ఓ పోటీ ప్రవేశపెట్టారు. ఉత్తమ అధికారిగా ఎన్నికచేయబడ్డవాళ్లకి ప్రపంచ పర్యటనతోబాటు విలువైన బహుమతి ప్రదానం కూడా చేస్తారు. మనిషి మానసిక ప్రవృత్తి చాలా చిత్రమైనది. అపురూపం అనుకున్నది, విలువైనది తనకే కావాలనుకుంటాడు. తను కోరుకున్నది పొందడంకోసం- ప్రక్కవాణ్ని పతనంచేయటానికైనా సిద్ధపడతాడు. మంచి ఆలోచనతో పెద్దవాళ్ల వృత్తిలోను, ప్రవృత్తిలోను పోటీ పెట్టినప్పటికి, అది ఆరోగ్యకరంకాదని నేనంటాను. ఈ పోటీల్లో ఎక్కువగా చోటుచేసుకొనేవి- అవినీతి, అసూయా, అశాంతీ, అల్లరీ, అవమానమూ మాత్రమే.

ఈ పోటీ నేను నెగ్గాలి. విదేశాలు తిరిగిరావాలి. అవార్డు తీసుకోవాలి. ఆ అదృష్టం నా పరంకావటానికి నేనేమైనా చేస్తాను. ఎవరి జీవితాన్నయినా నాశనం చేస్తాను. ఏ అధికారి కాళ్లయినా పట్టుకుంటాను.

పిసరు పిసరుగా కూడిన స్వార్థం నాలో ఓ మాంసపుముద్దగా చోటుచేసుకుంది. ఆఫీసులో ఉన్న ప్రతి ఒక్కరి చేత వాళ్ల రక్తం పిండి, సంపద పెంచాను. శ్రమపడేవాడి కనీస అవసరాల్నికూడా లెక్కచేయకుండా ఆఫీసు డబ్బును మిగిల్చి, వాళ్ల కన్నీళ్లనే ఖర్చుచేశాను. క్రమశిక్షణకోసమని చాలామందికి ప్రమోషన్లు వెనకబెట్టాను. ఎంతో తెలివిగా పై ఆఫీసర్లతో, ఆడిటర్లతో ప్రవర్తించాను.

సెంట్రలాఫీసునుండి డైరెక్టరుగారు వచ్చారు. అతని చేతుల్లో నా అదృష్టం ఉంది. అతన్ని ప్రసన్నం చేసుకోవాలి.

ఆఫీసు విషయంలో మా డైరెక్టరుగారు మంచి రిమార్కు రాశారు. తర్వాత అతని గౌరవార్థం పోష్ హోటల్లో ఖరీదైన విందు ఏర్పాటు చేశాను.

ఆ రాత్రి తను ఒంటరిగా నిద్రపోలేననీ, తనకి తోడుగా ఓ అందాల భామ కావాలని, ఆ అందాలతోడు స్టెనో మధుమతై ఉండాలని కోరాడు- అరవైయ్యేళ్లు దగ్గరపడుతున్న ముసలిపీనుగు డైరెక్టరు. ఉదయం యినస్పెక్షన్ జరుగుతున్నంతసేపు మధుమతిని అతని కెదురుగా కూర్చోబెట్టుకున్నాడు. ఆ అమ్మాయిలో అతని కూతురు కనిపిస్తుంది కాబోలు, అతిచనువుగా మాట్లాడుతున్నాడని నేను సరిపెట్టుకున్నాను. ఓ, హెల్! దుర్మార్గుడిది ఎంత లోతుగుండె.

తప్పదు. క్షుద్రదేవత కోరుకున్న బలి యివ్వాలి. అప్పుడే నాకు బంగారు బాట దొరుకుతుంది. కానీ, మధుమతి నిప్పులాంటి పిల్ల. ఆమెను బలిపీఠమ్మీదికి పంపించాలంటే సామాన్యమైన విషయం కాదు. గంటన్నరసేపు బుర్రబద్దలు కొట్టుకొని ఆలోచించాను. చివరికి మెరుపులాంటి అయిడియా వచ్చింది.

నేనే మధుమతి ఇంటికి వెళ్లాను. ఎంతో అందంగా కనిపించే ఆ అమ్మాయి జీవితం, ఆ ఇంటి వాతావరణం యింత జుగుప్సాకరంగా ఉంటాయని నేను ఊహించలేదు. పక్షవాతంలో ఉన్న తండ్రి, ఆకలి ఏడుపులతో చిన్నతమ్ముళ్లు చెల్లెళ్లు, పెచ్చులూడిపోయి పాతబడిపోయిన దొక్కు పెంకుటిల్లు, గుడ్డివెలుతురులో అస్తవ్యస్తంగా కనిపించే వస్తువులు చూస్తే సహజంగా మనిషన్నవాడికి జాలీ దయా కలగాలి. కానీ, నాకవేమీ అనిపించలేదు. డైరెక్టరుగార్ని తృప్తిపరచగలననే నమ్మకం ఏర్పడింది.

నన్ను చూసి, మధుమతి ఆశ్చర్యపోయింది నాకు మర్యాదచేయటానికెంతో అవస్థపడింది.

“మధుమతీ! నిన్ను డైరెక్టరుగారు చాలా మెచ్చుకున్నారు. హెడ్‌క్వార్టర్సు కెళ్లగానే, నీకు ప్రమోషన్ ఆర్డర్సు వేస్తామన్నారు.” కాసేపాగి మళ్లీ నేనే మాట్లాడాను- “ఆఁ.... ఇంతకూ నేనెందుకొచ్చానంటే, రేపు డైరెక్టరుగారు వెళ్లిపోతారట. అర్జంటు లెటర్సు కొన్ని రాత్రికి రాత్రే టైపుచేసి పెట్టాలట.... ప్లీజ్! నువ్వు కోపరేట్ చేయాలి....”

అంత సౌమ్యంగా నేనెప్పుడూ ఎవ్వర్నీ ఏదీ అడలేదు. మధుమతి నా మాటలకి కాస్త యిబ్బంది ఫీలయింది. మొహమాటంలో పడింది. కాదనలేకపోయింది.

“అలాగే, సార్! పిల్లలకు భోజనాలు వడ్డించి, ఇప్పుడే వస్తాను.”

మధుమతి వచ్చేవరకు అక్కడే నేను కూర్చుండిపోయాను. ఆ అమ్మాయి గబగబా పనులు చక్కబెట్టుకొని, నాతో బయలుదేరింది. మరికొన్ని క్షణాల్లో తను ఏంకాబోతుందో తెలియని అమాయకురాలు నన్ను అనుసరిస్తుంది. కాసేపు డైరెక్టరుగారితో మాట్లాడేక డిక్టేషను తీసుకోమని చెప్పి, మధుమతిని గదిలోవిడిచి, గెస్టుహౌసు బయటపడ్డాను. బయట ఆర్డర్లీతో అయ్యగార్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి, ఇంటికి వెళ్లిపోయాను.

‘ఏఁవయ్యా! నీ కన్నకూతుర్ని కావాలని అడిగితే, దట్ ఓల్డ్ బక్కెట్టుకి ఇలాగే సమర్పించుకుంటావా? నీలో నీతి

నెత్తురూ ఉన్నాయా?' అని మీరు ప్రశ్నించాలనుకుంటున్నారు కదూ?

మీ ప్రశ్నకి జవాబు యిస్తాను, కాసేపు ఆగండి.

ఆఁ, సుందరం భోజనం తీసుకొచ్చింది. రెండయి ఉంటుంది. ఇంట్లో అందరికీ అందిన తర్వాతే నాకు తినటానికైనా తాగటానికైనా సుందరం తీసుకువస్తుంది. నిజమేలెండి. సంపాదన లేనివాడికి అడిగే హక్కు ఉండకూడదు. ఇచ్చినప్పుడే పుచ్చుకోవాలి.

ఎక్స్క్యూజ్మీ. ఆకలిగా ఉంది. మీరు అనుమతిస్తే, నేను భోంచేస్తాను. కాసేపు కథను ఆపుదాం.

విశ్రాంతి

• • •

ఆఁ, యిందాక మీరేదో ప్రశ్న వేయబోయారు కదూ? అదే ప్రశ్న ఆ మర్నాడు నా ఆర్డర్లీ ఎంత ధైర్యంగా నన్నడిగాడో తెలుసాండీ?

"అయ్యా రేతిరి గోరం జరిగిపోనాది. ఆ డవిరెక్టుబాబు మదమ్మను బలత్కారంవుచేసి, సెరిపేశారు. ఆ యమ్మ కేక లేసింది. తలుపులు బాదింది. ఆడు గెడ తియ్యనేదు. నన్ను మాటాడనివ్వలేదు. మదమ్మ బతుకు బుగ్గిసేసేసినాడు. ఇదన్నేయం బాబూ!...." వాడు విలవిల్లాడిపోతున్నాడని ఆ ముఖం చెప్తుంది.

"షటప్....అబద్ధాలాడకు. ఆ వయసు గల కూతుళ్లు డైరెక్టరుగారి కున్నారు." కళ్లెర్రజేశాడు.

"మీరు లోనకంపింది ఆడి కూతుర్ని కాదుగదండీ.... బాబూ! మీ కూతుర్నో, మీ అప్పసెల్లెల్నో అడిగితే, అల్లాగే ఆడిగదిలోకి అంపించేవోరా?... మీ రెరిగుండే, ఆ యమ్మను తారిసారు..."

విప్లవం అనేది- యిదిగో యిలాంటి బురదమనిషి, చదువూసంధ్యాలేని మొండి వెధవనుండే పుడుతుంది.

ఆర్డర్లీ చెంప ఛెళ్లుమనిపించాను.

"డర్టీ గూస్.... ఒక్క మాట ఎక్కువగా మాటాడితే నిన్ను నిలువునా చీరేస్తాను. అనవసరమైన విషయాల్లో తల దూర్చకు. వెళ్లు.... రాత్రి జరిగింది పూర్తిగా మర్చిపో...లేపోతే, నిన్ను..." నా మాట పూర్తికాకుండానే వాడు బయటకు వెళ్లిపోయాడు. నేను అధికార మదంతో ఏమైనా చేయగలను. అఫ్టరాల్ ఆర్డర్లీ అంటే నా అడుగులకి మడుగులొత్తే ఓ స్కౌండ్రల్- వాడు రొమ్ము విరిచి, గొంతు పెంచి, నావాళ్ల గురించే వాగితే నేను సహించగలనా?

నాకు పూర్తి భరోసా యిచ్చి, డైరెక్టరుగారు వెళ్లిపోయారు.

'అమందానంద కందళిత హృదయారవిందుడనైతినోయ్' అని నాతో కరచాలనం చేశాడు. అబ్బా! ముసలి పీనుగులో ఎంత సంతోషం కనిపించింది.

ఆ మర్నాడు మధుమతి ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త వచ్చింది.

'ఎందుకూ, ఏమిటీ?'లాంటి కారణాలు ఎవరికీ తెలియవు. నన్ను అనుమానించే పురుగు ఒక్కటీ లేదు. పైగా ఆ అమ్మాయి తన చావుకి కారణం ఎవరూ కాదని రాసిపెట్టి మరీ చచ్చిపోయింది. థాంక్స్ టు హెర్. దేశంలో రోజూ ఎంతమంది చనిపోవడంలేదు. పోయినవాళ్లలో మధుమతి ఒకర్తి. మే హెర్ సోల్ రెస్టిండి హెవెన్.

వారం రోజులు గడిచిపోయాయి.

సెంట్రలాఫీసు నుండి నాకు డైరెక్టరుగారు ఫోన్చేసి, ఉత్తమ అధికారి అవార్డు నాకు లభించినట్లు చెప్పారు. అనుకున్నది నేను సాధించగలను. నా నమ్మకం నన్నెప్పుడూ నిరాశపరచలేదు

చీకటి పడింది. ఇంటికి బయలుదేరాను. ఇంట్లో సుందరంకి, పిల్లలకి అవార్డు విషయం చెప్పాలి.

సడన్గా నా కాళ్లకి బ్రేక్పడింది. ఆఫీసు స్టాఫు ఒక్కుమ్మడిగా నన్ను చుట్టుముడుతున్నారు. అన్ని కళ్లల్లో కోపం బుసలుకొడుతుంది. అన్ని చేతులూ ఒక్క గొలుసులా కలిసిపోయాయి. సమాధినుండి లేచిన పీనుగులు వికటాట్టహాసం చేస్తూ, నన్ను కబళించటానికి బరువైన అడుగులు వేస్తూ క్షణక్షణం సమీపిస్తున్నాయి.


యూనియన్ల తారతమ్యం లేదు. నువ్వూ నేనూ అనే భేదంలేదు. పేలికలు చీలికలైపోయిన దారప్పోగులు ఒక్క మోకుగా, ఒక విప్లవంలా, ఒక పెనుతుపానులా నా మీదికి విరుచుకు పడ్డాయి.

జీవితంలో మొదటిసారి భయపడ్డాను. రాక్షసత్వం కూడా సంఘటిత శక్తి ముందు కదిలిపోతుంది కాబోలు. నన్ను తను యిష్టం వచ్చినట్లు తిట్టారు. ఎందర్ని ఉసురుపెట్టానో, అందరూ యింకా అందరూ నన్ను హింసించారు. కసిదీరా చావగొట్టారు. కళ్ళు బైర్లు కమ్మాయి. నెత్తురు ప్రవహించింది. నిస్సహాయంగా కిందికి ఒరిగిపోయాను.

రెండురోజులు అపస్మారకంలోనే ఉన్నాను,

నాకు తెలివొచ్చేసరికి నా చుట్టూ నా ఇల్లాలు, పిల్లలు తప్ప మరెవరూ లేరు. ఈ ప్రమాదం ఎలా జరిగిందని వాళ్లడిగితే నేను ఎలాంటి సమాధానం యివ్వలేకపోయాను. నా అత్యాచారానికి అందరూ కలిసి యిచ్చిన 'బహుమతి' అని చెప్పుకోవాలి. అలాంటి నిజాన్ని తెలిస్తే, నా శ్రీమతి అసహ్యించుకుంటుంది. నా పిల్లలు నన్ను హీనంగా చూస్తారు. అది నేను భరించలేను. అందుకే నేను ఏమీ చెప్పలేకపోయాను.

పదిరోజులు హాస్పిటల్లో మంచమ్మీదే ఉన్నాను. నన్ను పరామర్శించటానికి ఆఫీసునుండి ఒక్కరు రాలేదు. నేను చచ్చిపోతే, నన్ను మోసుకుపోవటానికి



కనీసం నలుగురు మనుషులైనా వస్తారా అని భయంకరంగా ఆలోచించాను. నాలో పశ్చాత్తాపం మొదలయింది.

రాజధానిలో సంక్షేమ ఏర్పాటు చేశారు. క్రిష్ణ నా ప్రక్కనే ఉన్నాడు. కన్నులపండుగలా ఉందని, గొప్పగొప్ప వాళ్లంతా వచ్చారని, నన్ను పెద్దవాళ్ల మధ్య గౌరవంగా కూర్చోబెట్టారని క్రిష్ణ ఎంతో సంబరపడిపోయాడు.

అవార్డు తీసుకోవటానికి నన్ను డయాస్‌మీదికి పిలిచారు.

ఈ వేడుకని చూడాలని ఎన్ని కలలు కన్నానో, చూడ్డానికి నాకిప్పుడు కళ్ళు... ఆ కళ్ళు లేవండి. అంతా చీకటి. కటిక చీకటి. నన్ను ఒక్కసారే చంపకుండా, చచ్చేవరకు చీకటితో కుళ్లికుళ్లి చావమని నా కళ్ళు పీకేశారు, నా అధికారంలో ఏళ్ల తరబడి అన్యాయంచేయబడ్డ అనేకానేక మంది అభాగ్యులు, నాలాంటి దుర్మార్గుడికి తగిన శిక్ష యిచ్చారు.

గుడ్డిలోకం ఎంత బాధాకరమో తెలుసాండీ? చదవలేను. వ్రాయలేను. చూడలేను. చెప్పలేను. నిద్రలో మెలకువలో కనిపించేది చీకటి మాత్రమే. ఆ చీకటిని చూల్లేక తలబాదుకున్నాను. మతి పోగొట్టుకున్నాను. గొల్లున ఏడ్చాను. నా కళ్ళతోబాటు నాలో పేరుకున్న అహంకారం, స్వార్థం, ద్వేషం, అవినీతి, అన్నీ అంతరించిపోయాయి.

క్రిష్ణ సాయంతో డయాస్‌మీదికి వెళ్లి, అవార్డు అందుకున్నాను. మిన్నుముట్టే కరతాళధ్వనులు నాకు వినిపించాయి తప్ప ఎలాంటి అవార్డు యిచ్చారు, ఎవరి చేతులమీదుగా తీసుకున్నానో ఆ అపూర్వమైన దృశ్యాలు ఏవిటో నేను చూడలేకపోయాను.

గుడ్డివాడికి విదేశ పర్యటన దేనికని రద్దుచేశారు. నా సేవలు మా సంస్థకి ఉపయోగపడవని నా చేత ఉద్యోగం మాన్పించారు అంచెలంచెలుగా కిందికి మరీ కిందికి జారిపోయాను.

అదండీ, నా కథ! నా మీద సానుభూతి చూపించమని మిమ్మల్ని అడగను. ఆ అర్హత కూడా నాకు లేదు. అయితే– మిమ్మల్ని ఒక్క విషయం గురించి హెచ్చరిస్తున్నాను. నాలాంటి నీచులు ప్రతి రంగంలో, ప్రతి ఆఫీసులో, ప్రతి ఊళ్లో ఉంటారు. వాళ్లను రాక్షసులుగా పెరగనివ్వకండి వాళ్లను పట్టించుకోలేకపోతే– మీ జీవితాన్ని నాశనం చేస్తారు. మీ ఆడవాళ్లకి దిక్కులేకుండా చేస్తారు. మీ అప్పచెల్లెళ్లను పాడుచేస్తారు. మీ పిల్లల భవిష్యత్తును తుడిచివేస్తారు. రాక్షసుల సంఖ్య పెరిగితే దైవత్వం నశించిపోతుంది నీతి, నిజాయితీ, త్యాగం, ప్రేమా అనే పదాలు అంతరించిపోతాయి.

నాలాగ ప్రవర్తించే ఏ అధికారైనా ఏదో రోజున ఏదో విప్లవానికి లొంగిపోవడం నిజం. ఏదో ఒక దురవస్థకి గురికావడం తథ్యం. అధికారం చేతిలో ఉందని, మీ చేతికింద పనిచేసే మనిషిని హీనంగా చూడకండి. అందరిలో మీరూ ఒక్కరిగా వ్యవహరిస్తే, మిమ్మల్ని నెత్తినపెట్టుకుని పూజిస్తారు. మీకు బంగారు బాటను చూపిస్తారు.

అందుకే, మా విష్ణుకి అప్పుడప్పుడు నా కథను మరెవరి కథగానో వినిపించి హెచ్చరిస్తుంటాను. నా కొడుకు నా మార్గంలో నడవకూడదని నా వ్యథ. నా కొడుకే కాదు ఏ వ్యక్తీ అనుసరించకూడదని నా ప్రార్థన.

ఓ.కె. సార్! మా ఇంట్లో సందడిగా ఉంది. అంటే– విష్ణూ, క్రిష్ణా, మనవళ్లు ఇల్లు చేరినట్లున్నారు. ఉంటాను. ఓపిగ్గా నా కథ వ్యథ విన్న మీకు నా ధన్యవాదాలు.

గుడ్‌నైట్, రీడర్స్!

———